క్లుప్తంగా

పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోన

మండపేట: ఆలమూరు, మండపేట మండలాల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సీనియర్ పీఎంపీ వైద్యుడు కోన సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆదిత్య కళాశాల రోడ్డులోని శ్రీసూర్యనారాయణ ఆర్థోపెడిక్, ఎమర్జన్సీ కేర్ హాస్పిటల్ ఆవరణలో మంగళవారం సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ గంగుమళ్ళ రాంబాబు, జిల్లా కో కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు ఎన్నికలను పర్యవేక్షించారు. అధ్యక్షునిగా సత్యనారాయణ, కార్యదర్శిగా కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, కోశాధికారిగా వానపల్లి కనకరాజు, ఉపాధ్యక్షుడిగా బళ్ళా వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా ఏడిద లక్ష్మణాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ నాయకులు సూరంపూడి వీరభద్రరావు, సూరంపూడి సత్యనారాయణ, అద్దాల శ్రీనివాస్, ఆర్వీ నారాయణ, పుచ్చల కాశి, మండిపూడి చంద్రశేఖర్, ఎస్ రాఘవేంద్ర, ఐ వెంకటేశ్వరరావు, శకుంతల, ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

బిక్కవోలు: మండలంలో అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు మంగళవారం తెలిపారు. బిక్కవోలు పెట్రోల్ బంకు వద్ద వాహనాలు తనిఖీ చేయగా గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పుండి గోవిందు బైక్‌పై రూ.10,450 విలువ గల అక్రమ మద్యం తరలిస్తున్నాడు. అతడిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

రక్తదానం పరిపూర్ణ సేవాభావానికి నిదర్శనం

రామచంద్రపురం: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి వారికి మరో జన్మను ఇవ్వటం పరిపూర్ణమైన సేవాభావమని మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం, జీవీరావు పుట్టిన రోజున పురస్కరించుకుని మంగళవారం మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 70 మంది యువకులు, మహిళలు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి జీవీరావు ప్రశంసాపత్రాలను అందజేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు చైర్మన్ వైడీ రామారావు, పట్టణ ప్రముఖులు తొగరు మూర్తి, మోడరన్ ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ జి.మాణిక్యం పాల్గొన్నారు.

వర్తక సంఘం నాయకుడి మృతి


చంద్రరావు (ఫైల్)

కె.గంగవరం: మండల పరిధిలోని యర్రపోతవరం గ్రామ వర్తక సంఘం నాయకుడు వాసంశెట్టి చంద్రరావు అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామ మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్ తండ్రి చంద్రరావు వర్తక సంఘం నాయకుడిగా ఎన్నో సేవలు అందించి అందరి మన్ననలను పొందారు.

13న లీజుపై అవగాహన

మండపేట: పట్టణంలోని కొత్త బస్టాండుకు చెందిన 3,640 చదరపు గజాల స్థలాన్ని 15 సంవత్సరాల కాలపరిమితిపై లీజుకు ఇచ్చేందుకు టెండరు ప్రక్రియపై ఈ నెల 13వ తేదీన రాజమహేంద్రవరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ఆసక్తి కలిగిన వారు హాజరుకావాలని కోరారు.

ఈవోపీఆర్‌డీ విచారణ

రాయవరం: మండలంలోని పసలపూడి పంచాయతీలో మంగళవారం పంచాయతీ విస్తరణాధికారి మల్లేశ్వరరావు విచారణ నిర్వహించారు. 2018–19లో పంచాయతీ కార్యదర్శిగా పి.శ్రీనివాస్, ప్రత్యేకాధికారిగా పద్మజారాణి ఉన్న సమయంలో ఆర్థిక పరమైన ఆరోపణలపై జిల్లా పంచాయతీ అధికారి విచారణకు ఆదేశించారు. అమలాపురం పంచాయతీ విస్తరణాధికారిగా ఉన్న మల్లేశ్వరరావు పంచాయతీలో అప్పటి రికార్డులను పరిశీలించారు. ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి ఎం.నారాయణరెడ్డి విచారణాధికారికి రికార్డులను అందజేశారు. విచారణలో ఆరోపణలు ఎదుర్కొన్న అప్పటి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రత్యేకాధికారిగా పనిచేసిన పద్మజారాణితో పాల్గొన్నారు.

జనాభా పరిమితిపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: ఏ సామాజిక వ్యవస్థలోనైనా జనాభా సంఖ్య అత్యంత కీలకమవుతుందని, జనాభా పరిమితిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎన్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం నేపథ్యంలో అంగర, పడమర ఖండ్రికల్లో ర్యాలీ నిర్వహించారు.

టీడీపీ పాదయాత్ర

మండపేట: టీడీపీ నేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మద్దతుగా మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో మండపేటలో పాదయాత్ర నిర్వహించారు. కలువపువ్వు సెంటర్ మీదుగా కరాచీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు జరిగింది. నియోజకవర్గ అబ్జర్వర్ చిన్నం బాబు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎన్.వీర్రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారు



వలంటీర్లు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సహాయాలను తెలియజేస్తున్నారు. మాకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి విషయాన్ని మాకు చేరవేస్తున్నారు. మా కుటుంబం అంతటికీ కోవిడ్ వచ్చిన సమయంలో చుట్టుపక్కల వారు ఎవరూ సాయం చేసేందుకు ముందుకు రాలేదు. ఆ సమయంలో వలంటీర్ గుడాల సుశీల మాకు అన్ని విధాలా సహాయమందించారు.

– సారిక ధనలక్ష్మి, వి.సావరం, రాయవరం మండలం

ఆస్పత్రికి వచ్చి పింఛన్ ఇచ్చారు



కాలు విరిగి ఆస్పత్రిలో రెండు నెలలు ఉండిపోయాను. రాజమహేంద్రవరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆస్పత్రికి వచ్చి వలంటీర్ చందాల వెంకటలక్ష్మి పింఛన్ అందించారు. కనీసం దారి ఖర్చులు కూడా ఆశించకుండా మా వద్దకు వచ్చి మూడు నెలల పాటు పింఛన్ అందజేశారు. వలంటీర్ లేకపోతే ఎన్ని కష్టాలు పడాల్సి వచ్చేదో భగవంతుడికే తెలియాలి.

– పెచ్చెట్టి సూర్యకాంతం, వృద్ధురాలు, చింతలతోట శివారు చెల్లూరు, రాయవరం మండలం

పడిగాపులు తప్పాయి



తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు పింఛన్ల కోసం పంచాయతీ వద్ద పడిగాపులు పడేవాళ్లం. ఒక్కోసారి కళ్లు తిరిగి పడిపోయిన సందర్భాలున్నాయి. ఇప్పుడు వలంటీర్ల పుణ్యమా అంటూ ఆ బాధలు తప్పాయి. ప్రతి నెల ఒకటో తేదీనే, తెల్లవారకముందే వలంటీర్ పడాల సుమారాణి ఇంటికి వచ్చి పింఛన్లు అందజేస్తోంది. వలంటీర్లు మాలాంటి పేదలకు బిడ్డల్లాంటివారే.

– పసగాడి గవరరాజు, వృద్ధురాలు, పసలపూడి, రాయవరం మండలం.

వలంటీర్లు.. సేవాతత్పరులు


ఆస్పత్రిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనను కొత్తపుంతలు తొక్కించారు. అందుకు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లోంచి పుట్టిందే సచివాలయ, వలంటీర్ వ్యవస్థ. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ రెండు వ్యవస్థల ద్వారా పాలనను మండల స్థాయి నుంచి గ్రామ స్థాయికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. సేవే పరమావధిగా భావిస్తున్న వలంటీర్లు కేవలం నామమాత్రపు గౌరవ వేతనంతో విధులు నిర్వర్తిస్తూ..వెలకట్టలేని సేవలను అందిస్తున్నారని లబ్ధిదారులు వారిని వేనోళ్లా ప్రశంసిస్తున్నారు. కరోనా మహమ్మారిని సైతం లెక్క చేయకుండా వలంటీర్లు అందించిన సేవలు అమోఘమని చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సైతం దగ్గరకు రాని సమయంలో వలంటీర్లు కంటికి రెప్పలా తమను కాపాడారని అంటున్నారు.

కరోనా సమయంలో ఆదుకున్నారు



కరోనా సమయంలో ఇంట్లో నుంచి బయటకు రాలేని సమయంలో వలంటీర్లే మాకు ఆసరాగా నిలిచారు. మా పరిధిలోని షేక్ సుభాన్‌బీ వలంటీర్ మాకు కావాల్సిన నిత్యావసర వస్తువులు, అవసరమైన మందులు తెచ్చి ఇచ్చేవారు. మా నుంచి ఎటువంటి ఫలితాన్ని ఆశించకుండా కేవలం సేవా భావంతో పనిచేస్తున్నారు.

– మల్లిడి సీతయ్యమ్మ, గృహిణి, రాయవరం.

పిలిస్తే పలికేవారు



కరోనా సమయంలో భయంకరమైన పరిస్థితి ఇప్పటికీ కళ్లముందు కదలాడుతోంది. ఆ సమయంలో కేవలం వలంటీర్లు మాత్రమే పిలిస్తే పలికేవారు. అనారోగ్యంతో బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నప్పుడు అవసరమైన మందులు అందజేసి మా వలంటీర్ మట్టపర్తి రాజేశ్వరి ఆదుకుంది. వారి మేలును మరిచిపోలేను.

– మల్లిడి శారదలక్ష్మి, గృహిణి, వెదురుపాక, రాయవరం మండలం

పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- వలంటీర్ల డిమాండ్
- మండపేటలో భారీ ర్యాలీ
- పోలీసులకు ఫిర్యాదు


పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా మండపేటలో ర్యాలీ చేస్తున్న వలంటీర్లు


కూళ్ల గ్రామంలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వలంటీర్లు

మండపేట: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తమకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. ఏలూరు సభలో వలంటీర్ల మనోభావాలు దెబ్బతినే విధంగా పవన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం నియోజకవర్గంలోని వలంటీర్లు మండపేటలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కలువపువ్వు సెంటర్ నుంచి బస్టాండు వరకు భారీ ర్యాలీ చేశారు. ప్లకార్డులతో పవన్‌కల్యాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. బస్టాండు వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు కనిపించకుండా పోవడానికి తమకు సంబంధం ఏమిటని మండిపడ్డారు. కోవిడ్ కష్టకాలంలో మహమ్మారికి జడిసి సొంతవారు సైతం దగ్గరకురాని పరిస్థితుల్లో బాధితులకు అండగా ఉండి సేవలందించింది వలంటీర్లేనన్న విషయాన్ని పవన్ గుర్తుచేసుకోవాలన్నారు. తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి ప్రజల్లో చులకనయ్యారన్న విషయాన్ని పవన్‌కల్యాణ్ తెలుసుకుంటే మంచిదన్నారు. రాష్ట్రంలో 60 నుంచి 70 శాతం వరకు మహిళలే వలంటీర్లుగా సేవలు అందిస్తున్నారని, మహిళలు మిస్ అవడానికి తామెందుకు కారణమవుతామని మహిళ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పవన్‌కల్యాణ్‌పై ఎస్ఐ ఎం.అశోక్‌కు ఫిర్యాదు చేశారు.

పవన్ దిష్టిబొమ్మ దగ్ధం

కె.గంగవరం: మండల పరిధిలోని కూళ్ల గ్రామంలో మంగళవారం వలంటీర్లు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కూళ్ల–పామర్రు ప్రధాన రహదారిలో కొంతసేపు నిరసన చేసి అనంతరం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవా దృక్పథంతో పనిచేస్తున్న తమపై రాజకీయ దురుద్దేశంతో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. పవన్‌కల్యాణ్‌పై వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వెంటూరు వలంటీర్లు

కారుకూతలు కూస్తే ఖబడ్దార్

రాయవరం: కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కారుకూతలు కూస్తే తగిన బుద్ధి చెబుతామని వాలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని వెంటూరులో మంగళవారం వలంటీర్లు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. వలంటీర్లు పెంకే రాంబాబు, కొండేపూడి నారాయణరావు మాట్లాడుతూ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. వలంటీర్లు పవన్‌పై చర్యలు తీసుకోవాలని రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జగనన్న సురక్షతో ప్రజలందరికీ సంతృప్తికరమైన సేవలు

- జగనన్న సురక్షతో సంతృప్తికర సేవలు
- మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ


కందులపాలెంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి వేణు, ప్రజాప్రతినిధులు


రాయవరంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న పృథ్వీరాజ్, మంగతాయారు, వెంకటరమణ


లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వెంకన్నబాబు, సర్పంచ్ కిన్నెర, ఉప సర్పంచ్ శేషారావు


టేకి గ్రామసభలో ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలందరికీ సంతృప్తి కలిగించే రీతిలో ప్రభుత్వ సేవలు వారివారి ఇళ్ల వద్దే లభిస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కందులపాలెంలో గ్రామ సర్పంచ్ పెంకే కృష్ణవేణి అధ్యక్షతన మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి తమకు ఏ సేవలు పొందాలో తెలియని వారిని కూడా చైతన్య పరిచి వారికి అవసరమైన సేవలను వారి ఇళ్ల వద్దే అందిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు మేలు చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన కనిపిస్తుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వేణు కోరారు. అనంతరం గ్రామంలో మంజూరైన 647 ధ్రువీకరణ పత్రాలను మంత్రి వేణు చేతుల మీదుగా అందించారు. సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల అచ్యుతవేణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పెంకే వీరరాఘవులు, వెంటపల్లి శేషారావు, నెక్కంటి బుల్లబ్బులు, వాసంశెట్టి కృష్ణమూర్తి, పంపన శ్రీనివాసరావు, అధికారులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

మండపేట: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. మండలంలోని ద్వారపూడిలో మంగళవారం గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సర్పంచ్ కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, మండల పరిపాలన అధికారి వీఎస్ఎన్ ప్రసాద్, సంగిశెట్టి రమేష్, సత్తి సత్తిబాబు, సత్తి రాంబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఏడిదలో : మండలంలోని ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీడీఓ ఐ.రాజు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, పార్టీ నేత కుడిపూడి రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

పేదల ప్రయోజనాలే లక్ష్యం

కపిలేశ్వరపురం: పేద, మధ్య, తరగతి ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, టేకి సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి అన్నారు. టేకి–01 సచివాలయ పరిధిలో మంగళవారం సర్పంచ్ నాగమణి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు వివరించారు. వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించిన సేవలను వివరించారు. గ్రామంలో వివిధ శాఖలకు సంబంధించిన 2,417 సమస్యలను పరిష్కరించినట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారంలో సర్వే ద్వారా ఇంటింటికీ తిరిగి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు విశేష కృషి చేశారన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజ్, సచివాలయాల మండల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉమ్మిడిశెట్టి సూరిబాబు, పుట్టా అబ్బు, వీఆర్వో జాన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

రాయవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని వెంటూరు, రాయవరం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌లు వాసంశెట్టి వెంకట్రావు, చంద్రమళ్ల రామకృష్ణల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడారు. అనంతరం జనన, మరణ, కుల, ఆదాయం తదితర 11 రకాల సిటిజన్ సర్వీసులు అందించారు. వెంటూరులో 913 మందికి, రాయవరంలో అవసరమైనవారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు నున్న కృష్ణప్రదీప్‌కుమార్, బొడ్డు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి విజయకుమార్, గంటి రోజా, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు వాసంశెట్టి అనంతలక్ష్మి, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు, పంచాయతీ కార్యదర్శులు ఎ.కరుణాకర్, పలివెల వెంకటరత్నం పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలివ్వాలి

రాయవరం: బేడ బుడగ జంగాల సామాజిక వర్గానికి చెందిన తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని నేతలు కోరారు. రాయవరం తహసీల్దారు కార్యాలయం వద్ద వారు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు బేడ బుడగ జంగం కులానికి చెందిన వారికి ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు పొందామన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక పోవడంతో విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, పలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

మట్టి లారీలను అడ్డుకున్న రైతులు

రాయవరం: మండలంలోని పసలపూడిలో మంగళవారం రాత్రి రైతులు మట్టి లారీలను అడ్డుకున్నారు. భారీ వాహనాల్లో మట్టిని తరలించడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతులు తెలిపారు. వెదురుపాక–పసలపూడి రహదారిలో ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారన్నారు. పరిమితికి మించి భారీ వాహనాల్లో మట్టిని తరలించడం వలన ఇటీవల నిర్మించిన రహదారి ఛిద్రమవుతుందన్నారు. సింగిల్ రోడ్డు కావడంతో వాహనదారులు కూడా అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు భారీ వాహనాలు ప్రయాణించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

దళిత యువకుల మృతిపై దర్యాప్తు చేయాలి

రామచంద్రపురం రూరల్: గొల్లపాలెంలో ఇటీవల అనుమానాస్పద రీతిలో మృతిచెందిన దళిత యువకులు తాతపూడి మహేష్, నేరుడుమిల్లి శివకుమార్‌ల మృతిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని ద్రాక్షారామలో ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన సభలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువకులు ఇద్దరి మృత దేహాలపై గాయాలున్నాయని, కానీ పోలీసులు 174 సీఆర్‌పీసీగా నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీవైఎల్ నాయకుడు అంబటి కృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెదురుపాకలో గడపగడపకూ మన ప్రభుత్వం


వెదురుపాక గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: పేదరికమే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని వెదురుపాకలో సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి (పెద్దబ్బాయ్), మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు మండ వెంకటపద్మావతి, వాసంశెట్టి రామలక్ష్మి తదితరులతో కలసి ఎమ్మెల్సీ త్రిమూర్తులు మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ, వాటిని సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ నాలుగేళ్లలో 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోకి తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించే బుక్‌లెట్‌లను ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రజలకు అందజేశారు. వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ దంతుర్తి సుబ్రహ్మణ్యం, దేవస్థానం చైర్మన్లు తాడి బులివెంకటరెడ్డి, టేకుమూడి రాంబాబు, సొసైటీ మాజీ చైర్మన్ సత్తి వీరవెంకట, మాజీ సర్పంచ్ నల్లమిల్లి శివశంకరరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు సత్తి పద్దారెడ్డి, చిన్నీలు, సత్తి శ్రీనివాససోమిరెడ్డి, ఆకుల సుబ్రహ్మణ్యం, మండ వెంకటరెడ్డి, వాసంశెట్టి గోపికృష్ణ, గేలం సుబ్బారాయుడు, కంచి నగేష్, గుబ్బల ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతీ గడపకూ సంక్షేమం


నెలపర్తిపాడులో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో చూసిన ప్రజల ఇబ్బందులు తీర్చే విధంగా సంక్షేమ పాలన అందిస్తూ, ఆ సంక్షేమం అర్హత ఉన్న ప్రతీ గడపకూ చేరుతున్నదీ లేనిదీ తెలుసుకోవడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని నెలపర్తిపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ సమస్యలు ఉన్నాయా అని ఆరా తీస్తూ మంత్రి వేణు ఇంటింటికీ వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాఖా బాబీ, గ్రామ పెద్దలు వాసంశెట్టి జార్జి, శీలం రమణ, చిట్టూరి అర్జన్న, రాయుడు వీర్రాజు, ఉండవల్లి రామకృష్ణ, కట్టా శ్రీనివాస్, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

వార్డు పర్యటనలతో సత్ఫలితాలు

చైర్‌పర్సన్ దుర్గారాణి


స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టిన వార్డు పర్యటనలు సత్ఫలితాలనిస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, కౌన్సిలర్ ఎర్నేని ప్రభావతితో కలిసి మంగళవారం 5వ వార్డులో ఆమె పర్యటించారు. వీధులు, డ్రైన్లలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వారు చెప్పిన సమస్యలపై కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఆలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, అమలదాసు లక్ష్మి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.